




జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు






శుక్రవారం 26 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 02 సంచిక : 024 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## తుంగభద్ర ప్రాజెక్టు నూతన క్రస్ట్ గేట్ల ఘన ప్రారంభం: కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్

### ముగ్గురు ముఖ్యమంత్రుల సమక్షంలో ఆవిష్కరణ





హోస్పేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 26: కర్ణాటకలోని హోస్పేట వద్ద ప్రతిష్ఠాత్మక తుంగభద్ర ప్రాజెక్టుకు నూతనంగా ఏర్పాటు చేసిన 33 క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి శ్రీ సీఆర్ పాటిల్ గారి సమక్షంలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం 33 క్రస్ట్ గేట్లను కొత్తగా ఏర్పాటు చేయగా, కేంద్ర మంత్రి శ్రీ సీఆర్ పాటిల్ గారు మీట నొక్కి 17వ గేటును అధికారికంగా ప్రారంభించారు. అదేవిధంగా కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ డీకే శివకుమార్ గారు 18వ గేటును, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు 19వ గేటును, మరియు తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు 20వ గేటును ప్రారంభించి ఈ చారిత్రాత్మక ఘట్టంలో భాగస్వాములయ్యారు. గత 2024 ఆగస్టు నెలలో సంభవించిన భారీ వరదల కారణంగా ప్రాజెక్టు యొక్క 19వ గేటు దెబ్బతినడంతో, ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు భవిష్యత్తు భద్రతను దృష్టిలో ఉంచుకుని రూ.51 కోట్ల వ్యయంతో మొత్తం 33 కొత్త గేట్లను పటిష్టంగా ఏర్పాటు చేయడం జరిగింది. తుంగభద్ర జలాల సమర్థవంతమైన నిర్వహణకు, అలాగే ఈ ప్రాజెక్టు పరిధిలోని ప్రాంతాల సాగు మరియు తాగునీటి అవసరాల భద్రతను మరింత బలోపేతం చేయడంలో ఈ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ అత్యంత కీలకమైన మైలురాయిగా నిలవనుందని ఈ సందర్భంగా అధికారులు మరియు ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు.




## ఆర్డీఎస్ కింద తెలంగాణకు 15 టీఎంసీల నీరు అందించాలి: కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

హోస్పేట, జూన్ 26 (సందేశం టైమ్స్): రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) కింద తెలంగాణకు కేటాయించిన 15.9 టీఎంసీల నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. కర్ణాటకలోని హోస్పేట వద్ద తుంగభద్ర ప్రాజెక్టుకు నూతనంగా ఏర్పాటు చేసిన 33 గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ప్రస్తుతం మట్టి పేరుకుపోవడం మరియు ఇతర సాంకేతిక సమస్యల కారణంగా తెలంగాణ కేవలం 5 టీఎంసీల నీటినే వినియోగించుకుంటోందని, మిగిలిన నీరు అందక గద్వాల్, అలంపూర్ ప్రాంతాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మూడు రాష్ట్రాల మధ్య సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం జరుగుతున్న చర్చలు సానుకూల ఫలితాలు ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తూ, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నిష్పక్షపాతంగా సమస్యలను పరిష్కరిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల పునరుద్ధరణతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని సీఎం పేర్కొన్నారు.

## పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి దామోదర్ రాజనరసింహ





హైదరాబాద్/ఆందోల్, జూన్ 26 (సందేశం టైమ్స్): తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. హైదరాబాద్‌లోని జన్వాడలో నిర్వహించిన మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్ కుమార్ కుమారుడు ప్రణయ్ – డా. రితిక వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆందోల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వివాహ కార్యక్రమాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారి దాంపత్య జీవితం ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో నిండాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలకు హాజరైన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో అనిల్ కుమార్ రెడ్డి, డా. ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం.. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూన్ 26 (సందేశం టైమ్స్): దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నెల 27న శ్రీకారం చుడనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. సచివాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ, భద్రాచలం దేవస్థానం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆలయ వైభవానికి భంగం కలగకుండా సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించే రాతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారని, ఇందుకోసం ప్రభుత్వం రూ.351 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. వచ్చే శ్రీరామనవమి నాటికి నిర్దేశించిన పనులను పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి గడువులోపు పూర్తి చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు.




## ప్రభుత్వ ఉద్యోగుల భద్రతకు ప్రమాద బీమా.. తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుదాం: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 26 (సందేశం టైమ్స్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల భద్రత కోసం ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, సింగరేణి కార్మికులకు ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకుండా కోటి రూపాయల బీమా అందించిన నమూనాను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా విస్తరిస్తున్నామని తెలిపారు. ప్రమాద బీమా ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల యజమానిగా వారి సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రతి నెల మొదటి తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, రిటైర్మెంట్ బెనిఫిట్లను కూడా విడతల వారీగా విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల విజయవంతమైన అమలులో ఉద్యోగుల పాత్ర కీలకమని కొనియాడారు. రోజుకు ఒక గంట అదనంగా పనిచేసి రాష్ట్ర ఆదాయాన్ని పెంచాలని, ఆ ఆదాయాన్ని ఉద్యోగుల అవసరాల కోసం వినియోగిస్తామని పేర్కొన్నారు. తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ఉద్యోగుల సహకారం అవసరమని సీఎం పిలుపునిచ్చారు. ప్రజల కోసం ఏర్పడిన తెలంగాణలో ప్రజల సేవలో ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

## భారీగా పెరిగిన పాస్‌పోర్ట్ ఛార్జీలు.. జూలై 1 నుంచి కొత్త ఫీజులు అమలు




న్యూఢిల్లీ, జూన్ 26 (సందేశం టైమ్స్): కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (MEA) పాస్‌పోర్ట్ నిబంధనలను సవరిస్తూ పాస్‌పోర్ట్ సేవల ఛార్జీలను భారీగా పెంచింది. సవరించిన ఫీజులు 2026 జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. కొత్తగా లేదా రీ-ఇష్యూ కోసం 36 పేజీల పాస్‌పోర్ట్‌కు సాధారణ కేటగిరీలో రూ.2,500, తత్కాల్‌లో రూ.5,000 చెల్లించాల్సి ఉండగా, 60 పేజీల పాస్‌పోర్ట్‌కు సాధారణంగా రూ.3,500, తత్కాల్ కింద రూ.6,000 ఫీజు నిర్ణయించారు. అలాగే పాస్‌పోర్ట్ పోయినప్పుడు లేదా దెబ్బతిన్నప్పుడు రీప్లేస్‌మెంట్ కోసం 36 పేజీల పాస్‌పోర్ట్‌కు సాధారణంగా రూ.5,000, తత్కాల్‌లో రూ.7,500, 60 పేజీల పాస్‌పోర్ట్‌కు సాధారణంగా రూ.6,000, తత్కాల్‌లో రూ.8,500 వరకు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్స్ (సవరణ) రూల్స్–2026ను జారీ చేసింది.




## తాత్కాలిక ఆనందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దు: మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

మెదక్, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 26: తాత్కాలిక ఆనందం కోసం మత్తు పదార్థాల బారిన పడితే జీవితాన్నే కోల్పోయే పరిస్థితులు ఎదురవుతాయని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు విద్యార్థులను హెచ్చరించారు. నషా ముక్త్ భారత్ అభియాన్–మిషన్ పరివర్తన్ కార్యక్రమాల్లో భాగంగా మెదక్ మండలం మాబోజిపల్లి గీత హైస్కూల్లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలో తీసుకునే ప్రతి నిర్ణయం భవిష్యత్తును నిర్దేశిస్తుందని, తాత్కాలిక ఆనందం, చెడు స్నేహాలు, ఆసక్తి కోసం మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ప్రస్తుతం కొందరు యువత డ్రగ్స్‌తో పాటు పెట్రోల్ వాసన పీల్చడం, వైట్నర్, నెయిల్ పాలిష్ వంటి రసాయన పదార్థాలను దుర్వినియోగం చేస్తూ కొత్త రకాల వ్యసనాలకు లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇటువంటి అలవాట్లు మెదడు, గుండె, ఊపిరితిత్తులు తదితర కీలక అవయవాలపై తీవ్ర ప్రభావం చూపి ప్రాణాపాయ పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో కొందరు మహిళలు కల్లు వంటి మత్తు పానీయాలకు అలవాటు పడటం వల్ల గర్భిణులు, శిశువుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వివరించిన ఆయన, వ్యసనాలకు గురైన వారిని నిర్లక్ష్యం చేయకుండా చికిత్స, కౌన్సెలింగ్ ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. డ్రగ్స్‌కు బానిసైన వ్యక్తులు సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని కోల్పోయి చట్టవిరుద్ధ కార్యకలాపాల వైపు మళ్లే ప్రమాదం పెరుగుతుందని తెలుపుతూ, రాష్ట్రంలో గతంలో జరిగిన కొన్ని సంచలనాత్మక నేరాల ఉదాహరణలతో మత్తు పదార్థాల దుష్పరిణామాలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. డ్రగ్స్ వ్యసనం వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొంటూ, విద్యార్థులు చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ విక్రయం, వినియోగం లేదా అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని కోరిన అనంతరం, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించి, విద్యార్థులతో కలిసి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి మద్దతుగా నిర్వహించిన మానవహారంలో ఎస్పీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి, డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, మెదక్ రూరల్ సీఐ కృష్ణమూర్తి, గీత హైస్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ పిల్లలకు పౌష్టికాహారం అందించాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

నర్సాపూర్, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 26: అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నపిల్లలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బలవర్ధకమైన సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. నర్సాపూర్ మండలంలోని అచ్చంపేట్ అంగన్వాడి కేంద్రాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి మరియు తహశీల్దార్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ బాలబాలికలకు ప్రభుత్వం నిర్ణయించిన ఆహార పట్టిక ప్రకారం బలవర్ధకమైన సంపూర్ణ పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల పరిసరాలను ఎల్లప్పుడూ అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని, వయస్సుకు తగ్గట్టుగా కాకుండా తక్కువ బరువు మరియు తక్కువ ఎత్తు ఉన్న పిల్లలను ప్రత్యేకంగా గుర్తించి వారి శారీరక ఎదుగుదల మరియు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ వెళ్లి ఓటర్ల గణన ఫారమ్‌ల పంపిణీ: మెదక్ ఆర్డీవో రమాదేవి





మెదక్, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 26: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్వోలు) ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల గణన (ఎన్యూమరేషన్) ఫారమ్‌లను పంపిణీ చేస్తున్నట్లు మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు. మెదక్ మండలం రాయలమడుగు గ్రామంలో ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె స్వయంగా పరిశీలించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు జూన్ 25 నుంచి జూలై 24 మధ్య కాలంలో ప్రతి ఇంటింటికీ తిరుగుతూ ఈ ఫారమ్‌లను పంపిణీ చేయడం, వాటిని పూర్తిగా పూరించి తిరిగి సేకరించడం చేస్తారని వివరించారు. ఒకవేళ ఎవరికైనా ఈ ఫారమ్ అందకపోతే, అలాంటి వారు భారత ఎన్నికల సంఘం ద్వారా అంతర్జాలంలో (ఆన్‌లైన్‌లో) కూడా తమ వివరాలను సమర్పించుకోవచ్చని ఆమె స్పష్టం చేశారు. ఈ ఎస్ఐఆర్ సర్వే విజయవంతం కావడానికి ప్రజలందరూ పూర్తిస్థాయిలో అవగాహనతో సిబ్బందికి సహకరించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ తహశీల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత బూత్ స్థాయి అధికారులు మరియు వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన బూత్ లెవెల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ప్రజలందరూ తప్పక పాల్గొనాలి: టీజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి.సంగమేశ్వర్, జూన్ 26: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ప్రజలందరూ తప్పనిసరిగా పాల్గొనాలని టీజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని కంది మండలం ఎద్దుమైలారం గ్రామంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఆమె స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు అనేది అత్యంత విలువైనదని, తమ ఓటును భద్రపరుచుకోవడానికి ప్రతి ఒక్కరూ ఈ సర్ ప్రక్రియలో పాల్గొనాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ అనేది ఇదే తొలిసారి కాదని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇది ఎనిమిదోసారి జరుగుతున్న సమగ్ర సవరణ ప్రక్రియ అని ఆమె ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్, కంది మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోగులయ్య, ఎద్దుమైలారం సర్పంచ్ చంద్రయ్య, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా క్విట్ కార్పొరేట్ ఉద్యమాన్ని నిర్మిద్దాం: వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ



మెదక్, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 26: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ఉపాధి హామీ కూలీల పొట్ట కొట్టే వి.బి.జి.రామ్.జీ పథకాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యుత్ సంస్కరణలు మరియు విత్తన బిల్లులను రద్దు చేసే వరకు సంయుక్తంగా పోరాటాలు కొనసాగిస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ పిలుపునిచ్చారు. కేవల్ కిషన్ భవన్‌లో సి.ఐ.టి.యూ, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా జూలై, ఆగస్టు నెలల్లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలను చైతన్యం చేస్తూ పోరాటాలకు సన్నద్ధం చేయాలని ఆమె కోరారు. నాడు బ్రిటిష్ నిరంకుశ పాలన దేశ సహజ సంపదను దోచుకుపోతే దానికి వ్యతిరేకంగా 1947 ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమం నిర్వహించామని, నేడు దేశంలో నరేంద్ర మోదీ పరిపాలన కూడా పేదల పొట్టలు కొట్టి, దేశ సంపదను, సహజ వనరులను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల పరం చేస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలు, ఉపాధి హామీ చట్టం రద్దు, విత్తన విద్యుత్ సంస్కరణ చట్టం చేయడం దీనికి నిదర్శనమన్నారు. తెలంగాణలోని రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేంద్ర బీజేపీ బాటలోనే నడుస్తూ నరేంద్ర మోడీ తెచ్చిన లేబర్ కోడ్స్, వి.బి.జి.రామ్.జీ పథకం, విద్యుత్ సంస్కరణల అమలుకు చర్యలు తీసుకోవడం విచారకరమన్నారు. ఈ దేశంలో మోడీ సర్కారు, కార్పొరేట్ బంధాన్ని విడదీయాలంటే క్విట్ ఇండియా ఉద్యమం మాదిరిగా 'క్విట్ కార్పొరేట్' ఉద్యమాన్ని దేశంలో నిర్వహించాల్సిన అవసరం ఏర్పడిందని ఆమె స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెస్తున్న విద్యుత్ సంస్కరణలకు, రాష్ట్ర ప్రభుత్వం తెస్తానంటున్న రైతు డిస్కమ్‌కు వ్యతిరేకంగా ప్రజలను, వినియోగదారులను చైతన్యపరుస్తూ మండల స్థాయిలో సదస్సులు నిర్వహిస్తామని, ఇందులో భాగంగా జూలై 4న జిల్లా సదస్సు, జూలై 10న విద్యుత్ ఎస్.ఈ ఆఫీస్ ముందు ధర్నా మరియు ఆగస్టు 10న జరిగే 'జైల్ భరో' కార్యక్రమంలో జిల్లాలోని కార్మికులు, కర్షకులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బలమణి, ఏ.మల్లేశం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోరయ్య, కే.మల్లేశం, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనర్సయ్య, వివిధ సంఘాల నాయకులు లచాగౌడ్, నరేందర్, పోచమ్మ, శేఖర్, యేసు తదితరులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలకు, గంజాయికి యువత దూరంగా ఉండాలి: అల్లాదుర్గం ఎస్సై శంకర్

అల్లాదుర్గం, సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్, జూన్ 26: మత్తు పదార్థాలైన డ్రగ్స్, గంజాయి అలవాటుకు బానిసై యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని అల్లాదుర్గం ఎస్సై శంకర్ హితవు పలికారు. అందోల్ నియోజకవర్గం అల్లాదుర్గం మండల ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఇందులో భాగంగా మండల కేంద్రమైన అల్లాదుర్గం ఎక్స్ రోడ్ వద్ద అందరూ కలిసి మానవహారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై శంకర్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, మంచి లక్షణాలతో ఉన్నతమైన ఆశయాలను ఏర్పరచుకుని తమ జీవిత గమ్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో యువతను పక్కదారి పట్టిస్తున్న గంజాయి, డ్రగ్స్ వంటి ప్రాణాంతక మత్తు పదార్థాలను ఎవరైనా అక్రమంగా రవాణా చేసినా లేదా విక్రయించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## డాక్టర్ ఎస్.పీ. భరిల్‌కు ప్రతిష్ఠాత్మక 'గోల్డెన్ రుద్రాక్ష' పురస్కార ప్రదానం

నారాయణఖేడ్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 26: ప్రత్యక్ష విక్రయ రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను డాక్టర్ ఎస్.పీ. భరిల్‌కు శూలినీ విశ్వవిద్యాలయం తమ అత్యున్నత గౌరవమైన 'గోల్డెన్ రుద్రాక్ష' పురస్కారాన్ని ఘనంగా ప్రదానం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ప్రత్యేకంగా నిర్వహించిన విక్రయాల మహాసభ–2026 సందర్భంగా ఆ విశ్వవిద్యాలయ కులాధిపతి పి.కె. ఖోస్లా ఆయనకు అందజేశారు. ఏపీజే అబ్దుల్ కలాం సభా ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నాటిన చెట్టు ఫలంతో ప్రత్యేకంగా తయారైన రుద్రాక్ష మాలను డాక్టర్ భరిల్‌కు బహూకరించడం అక్కడి వారందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ భరిల్ "ఈ భావాల ఫలితం ఏమిటి?" అనే ఆధ్యాత్మిక అంశంపై అద్భుతంగా ప్రసంగించి సదస్సులోని సభికులను ఎంతగానో అలరించారు. ఈ రంగంలో దశాబ్దాలుగా ఆయన అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా లభించిన ఈ అత్యున్నత గౌరవం ఆ రంగానికే ఎంతో గర్వకారణమని ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు కొనియాడారు.



## చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ పరాస్ కుమార్

చింతకాని, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 26: ఖమ్మం జిల్లా చింతకాని మండల కేంద్రంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ పరాస్ కుమార్ ఐఏఎస్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని विभिन्न విభాగాలు, వార్డులు, అవుట్ పేషెంట్ మరియు ఇన్ పేషెంట్ సేవలను నిశితంగా పరిశీలించారు. అలాగే ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులు మరియు నివేదికలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, పారిశుధ్య నిర్వహణ మరియు సిబ్బంది హాజరు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించిన ఆయన, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా అధికారులు, వైద్య సిబ్బంది ఎంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆయన వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## మేడికుందలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఘనంగా ప్రారంభం

వట్‌పల్లి, సందేశం టైమ్స్ వట్పల్లి మండల్ రిపోర్టర్ బస్వరాజు, జూన్ 26: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మేడికుంద గ్రామంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం బూత్ స్థాయి అధికారులు చరణ్ రాజ్ (27వ బూత్), మాదేవి (28వ బూత్) ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ ఓటర్ల గణన ఫారమ్‌లను ప్రజలకు అందజేశారు. అలాగే 2002 సంవత్సరం ఓటర్ల జాబితాను ప్రతి ఒక్కరూ సులభంగా పరిశీలించుకునేందుకు వీలుగా వాట్సాప్ ద్వారా మరియు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఓటరు వివరాలలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని, సాధ్యమైనంతవరకు ఈ ఫారమ్‌లను ఆంగ్లంలో పూరించి బూత్ స్థాయి अधिकारियोలకు అందజేయాలని వారు గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామకృష్ణాపురంలో విస్తృతంగా పర్యటించిన బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు



చింతకాని, సందేశం టైమ్స్ ఖమ్మం ఇంచార్జ్ శెట్టి సురేష్, జూన్ 26: ఖమ్మం జిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురంలో బిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు గారు విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఓటరు నమోదు మరియు సవరణల తీరుపై స్థానిక నాయకులకు తగిన దిశానిర్దేశం చేశారు. అనంతరం ఇటీవల వివిధ కారణాలతో మరణించిన పలు కుటుంబాలను ఆయన స్వయంగా పరామర్శించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వంకాయలపాటి లచ్చయ్య, మంకెన రమేష్, బొడ్డు వెంకట రామయ్య, గురజాల హనుమంతరావు, రవీంద్ర రెడ్డి, మునుగోటి రత్నాకర్, కన్నెబోయిన కుటుంబరావు, పిన్నెల్లి శ్రీనివాస్, శెట్టి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్





సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 26: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఐబీ భవనం వరకు జరిగిన ఈ ర్యాలీలో विभिन्न విద్యాసంస్థలకు చెందిన విద్యార్థినులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్ర ఈగల్ బృందం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్ల పరిధిలో విద్యాసంస్థల ఆధ్వర్యంలో ర్యాలీలు, మానవహారాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరూ మాదకద్రవ్య వ్యతిరేక సైనికులుగా ఉండాలని ప్రతిజ్ఞ చేయిస్తున్నట్లు తెలిపారు. యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనలో ముందుకు సాగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తుపదార్థాలకు బానిసలు కాకూడదని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయం, అక్రమ రవాణా, వినియోగం జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే జిల్లా ఎస్-న్యాబ్ సహాయక నంబర్ 8712656777కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. जिला కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాను మత్తుపదార్థాల రహిత జిల్లాగా మార్చడంలో గ్రామస్థాయి నుంచే సంకల్పంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "మత్తుపదార్థాలు వద్దు... జీవితమే ముద్దు" అనే నినాదంతో విద్యార్థులు ప్రతిజ్ఞ చేయడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు మరియు యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




## జోగిపేటలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన ఆర్‌డీఓ రమేష్ బాబు

జోగిపేట, సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి, జూన్ 26: జోగిపేట పట్టణంలో ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సర్వే ప్రక్రియను జోగిపేట రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) రమేష్ బాబు, తహసీల్దార్ మధుకర్ సాగర్ రెడ్డిలతో కలిసి క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు పట్టణంలోని ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి సర్వే జరుగుతున్న తీరును పరిశీలించడంతో పాటు స్థానిక ప్రజల నుంచి వివరాలను సేకరిస్తున్న బూత్ స్థాయి సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ ఓటర్ల సర్వేను అత్యంత పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఓటర్ల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు లేదా తప్పులు జరగకుండా అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరించాలని, వివరాలు సేకరించే సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈ సమగ్ర ప్రక్రియను సకాలంలో విజయవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆర్‌డీఓ ఆదేశాలు జారీ చేశారు.



## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం

సంగారెడ్డి, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 26: జిల్లాలో ప్రశాంతమైన, పారదర్శక వాతావరణంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)–2026 కార్యక్రమానికి సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ఒక ముఖ్యమైన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రజలందరికీ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించే బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సర్వే కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో సహకరించాలని, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను, సూచనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పూర్తి వివరాలు నమోదు చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



నర్సాపూర్, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 26: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మరియు నర్సాపూర్ మండలంలోని అచ్చంపేట గ్రామంలో జరుగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్-2026) ప్రక్రియను రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) మరియు తహశీల్దార్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు ఈ కార్యక్రమ నిర్వహణపై పలు కీలక సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. ఓటర్ల గణన పత్రాలను అందజేయడం, వాటిని తిరిగి సేకరించడం మరియు వివరాల నమోదు ప్రక్రియల్లో అత్యంత జాగ్రత్త వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన పేరును నమోదు చేసుకోవడం ప్రాథమిక ప్రజాస్వామ్య బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందిస్తున్నామని వెల్లడించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని, చిరునామా మార్పులు, పేర్ల సవరణలు మరియు ఇతర వివరాల నవీకరణ కోసం ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మన రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల గణన పత్రాలను పంపిణీ చేస్తారని, ప్రజలందరూ వారికి సరైన వివరాలను అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ తహశీల్దార్ శ్రీనివాస్, బూత్ స్థాయి అధికారులు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మెదక్ జిల్లా గురుకులాల్లో పార్ట్ టైం ఉపాధ్యాయుల నియామకం: దరఖాస్తుల ఆహ్వానం

మెదక్, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 26: మెదక్ జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న వివిధ బోధనా పోస్టులను 2026-27 విద్యా సంవత్సరానికి గాను పార్ట్ టైం ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని మెదక్, తూప్రాన్, రామాయంపేట, కుల్చారం గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు మరియు మెదక్ మహిళా డిగ్రీ కళాశాల (TGSWRDC W) లలో మొత్తం 23 ఖాళీ పోస్టులు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ ఖాళీలలో జూనియర్ లెక్చరర్లు (తెలుగు, ఇంగ్లీష్, బోటనీ), పీజీటీలు (తెలుగు మినహా మిగిలిన అన్ని సబ్జెక్టులు), టీజీటీలు (తెలుగు, హిందీ, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్) తో పాటు ఫిజికల్ డైరెక్టర్, పీఈటీ, లైబ్రేరియన్ పోస్టులు ఉన్నాయని వివరించారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో ప్రభుత్వం నిర్దేశించిన విద్యార్హతలు కలిగి ఉండాలని, గురుకులాల నిబంధనల ప్రకారం మహిళా విద్యాసంస్థల్లో మహిళా అభ్యర్థులకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూన్ 26 నుండి జూలై 4 వరకు తమ ఒరిజినల్ మరియు జిరాక్స్ ధృవీకరణ పత్రాలతో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం జూలై 6వ తేదీ ఉదయం 10:00 గంటలకు మెదక్ లోని బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాల (TGSWRS/JC G) లో సబ్జెక్టు నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో డెమో మరియు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని వెల్లడించారు. ఈ నియామకాలకు సంబంధించి ఇతర పూర్తి వివరాల కోసం మెదక్ జిల్లా సమన్వయకర్త అనురాధ గారిని 9059526124 మొబైల్ నంబర్‌లో సంప్రదించాల్సిందిగా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.

## డంపింగ్ యార్డులో వ్యర్థాల శుద్ధి ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 26: బాలెంల గ్రామ పరిధిలోని మున్సిపల్ డంపింగ్ యార్డును జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సందర్శించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డులో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఏ విధంగా శుద్ధి చేస్తున్నారో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవల అక్కడ ఏర్పాటు చేసిన బయో మైనింగ్ యంత్రం పనితీరును, దాని ద్వారా తడి, పొడి వ్యర్థాలను ఎలా శుద్ధి చేస్తున్నారనే సాంకేతిక అంశాలపై అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. డంపింగ్ యార్డు పరిసరాల్లో పేరుకుపోయిన తడి చెత్తను త్వరితగతిన శుద్ధి చేయాలని, ఎటువంటి చెత్త నిల్వలు పేరుకుపోకుండా పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు పరిశుభ్రమైన వాతావరణం అత్యంత అవసరమని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి సోమయ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, మున్సిపల్ మరియు ఇంజినీరింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సర్వే (సర్) ప్రక్రియను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 26: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ప్రారంభించిన ఇంటింటి సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించబోయే ఈ ఓటర్ల సమగ్ర సర్వే కార్యక్రమంలో భాగంగా సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్తున్న తీరును పర్యవేక్షించిన కలెక్టర్, ప్రతి ఓటరుకు రెండు ఫారాలను అందజేయడంతో పాటు బీఎల్‌ఓలకు అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఓటరు వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత బీఎల్‌ఓలకు తెలియజేసి వెంటనే సరిచేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇదే క్రమంలో ఎవరైనా కావాలని అధికారులకు తప్పుడు సమాచారం అందిస్తే ఫారంలో పొందుపరిచిన నిబంధనల ప్రకారం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటరు జాబితా అత్యంత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని కోరిన ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు, డిప్యూటీ తహసీల్దార్ లాలు, బీఎల్‌ఓ బంగారు పద్మ మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.